## క్లుప్తంగా

### చౌడేశ్వరీదేవి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**జమ్మలమడుగు :** మండల పరిధిలోని మోరగుడి గ్రామంలో తొగట వీర క్షత్రియుల కులదైవమైన చౌడేశ్వరీ దేవి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా తన వంతు బాధ్యతగా నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

### పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

**వల్లూరు(చింతకొమ్మదిన్నె) :** నిరుపేదలకు ఇంటి స్థలాల కేటాయింపు కోసం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె సచివాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం కోసం కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి అయిదు నెలలు దాటినా ఆ హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు నాని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివ, బాషా అధిక సంఖ్యలో అర్జీదారులు పాల్గొన్నారు.

### ఘనంగా భక్త కనకదాసు జయంతి

**పులివెందుల రూరల్ :** స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో సోమవారం సాహితీ మహోన్నతుడు శ్రీ భక్త కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్త కనకదాసు తన కీర్తనల ద్వారా సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శేష మహేశ్వరమ్మ, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ జి.మురళి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### వైభవంగా సిద్ధగురుస్వామి ఆరాధన ఉత్సవాలు

**పెండ్లిమర్రి :** మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ జగద్గురు సిద్ధగురు స్వామి ఆరాధన ఉత్సవాలు మూడవ కార్తీక సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ ఆవరణంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో నాలుగు జతల ఎద్దు పాల్గొన్నాయి.

### నేటి నుంచి ఆధార్ క్యాంపు

**వల్లూరు (చింతకొమ్మదిన్నె) :** చింతకొమ్మదిన్నె గ్రామ సచివాలయంలో ఈనెల 19 నుంచి 22 వరకు నాలుగు రోజులపాటు ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిబాబు తెలిపారు. ఆధార్ కేంద్రంలో 0 నుంచి 5 సంవత్సరాల వారికి ఆధార్ అప్‌డేట్ చేయడం, ఆధార్ కార్డులో ఫొటో, చిరునామా మార్పు చేయడం, ఫోన్ నంబర్ లింక్ చేయడం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం వంటి సేవలు అందిస్తారన్నారు.

### ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా లీలాకృష్ణ

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన లీలాకృష్ణ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభల్లో ఆయనను ఈమేరకు ఎన్నుకున్నారు.

### పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు

**కమలాపురం :** ఈ నెల 16వ తేదీన వైవీయూలో కేంద్ర ప్రభుత్వం, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్-2024లో కమలాపురం పాలిటెక్నిక్‌కు చెందిన ఈసీఈ సెకండియర్ విద్యార్థులు మహేష్ వర్ధన్ బృందం ప్రతిభ చాటారు. యువ ఉత్సవ్‌లో నిర్వహించిన సైన్స్ మేళాలో వారు స్మార్ట్ లగేజీ అండ్ చార్జింగ్ స్టేషన్ అనే ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. ఈ ప్రాజెక్ట్ తృతీయ బహుమతికి ఎంపికైంది. రూ.3వేల నగదు బహుమతిని వీరు అందుకున్నారని ప్రిన్సిపల్ తెలిపారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు వారిని అభినందించారు.

### కనుల పండువగా అయ్యప్ప స్వామి మండల పూజ

**పులివెందుల రూరల్ :** మండల పరిధిలోని నల్లగొండువారిపల్లె గ్రామంలో అయ్యప్పస్వామి మండల పూజ కనుల పండువగా నిర్వహించారు. గురుస్వాములు అంబకపల్లె శ్రీనివాసులు, చిన్నరంగాపురానికి చెందిన వెంకటరామిరెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి అయ్యప్ప స్వామికి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు శ్రావణ్ కుమార్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లడ్డు వేలంపాట వేయగా ఎల్లారెడ్డి, నాగేంద్ర రెడ్డిలు లడ్డూను దక్కించుకున్నారు.

# శంభో..శివ శంభో


పుష్పగిరి కొండపైన శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పులివెందుల : ప్రత్యేక అలంకరణలో శ్రీమిట్టమల్లేశ్వరుడు


ప్రత్యేక పూజలందుకొన్న మునీశ్వరుడు


ప్రత్యేక అలంకరణలో కోనమల్లేశ్వర స్వామి


సింహాద్రిపురం: ప్రత్యేక అలంకరణలో శ్రీభానుకోట సోమేశ్వరస్వామి

- కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు
- శైవ క్షేత్రాలలో పోటెత్తిన భక్తులు
- వేడుకగా శివపార్వతుల కళ్యాణం


చెన్నూరు: పూజలందుకున్న స్వామి వారు


పుష్పగిరిలో ప్రత్యేక అలంకరణలో శ్రీ చెన్న కేశవ స్వామి


వల్లూరు: పండ్లతో శ్రీ చక్ర సహిత భవానీ మాత అలంకారం


కమలాపురం: టి.చదిపిరాళ్లలో పూజలందుకుంటున్న శివ లింగం

**పులివెందుల టౌన్ :** కార్తీక మాసోత్సవాలలో భాగంగా మూడవ కార్తీక సోమవారం శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున 2గంటల నుంచి భక్తులు ఆలయాలకు వచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. శివుడిని స్మరించుకుంటూ ఆలయాలలో ప్రదక్షిణలు నిర్వహించి బిల్వార్చన, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు రుద్రమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. ఉదయం అభిషేకాల అనంతరం సాయంత్రం మిట్టమల్లేశ్వరస్వామిని ప్రత్యేక అలంకరించారు. సాయంత్రం ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణల ఆధ్వర్యంలో మిట్టమల్లేశ్వరస్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే అమ్మవారిశాలలోని నగరేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణం అనంతరం రాత్రి వీరశైవ గురు జంగమ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. మండల పరిధిలోని నామాలగుండు, పంచలింగాల కోన, గుండాలయ కోన తదితర శైవ క్షేత్రాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కమలాపురంలో..**

**కమలాపురం :** మండలంలోని పాతాళ సోమేశ్వరాలయంలో ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని, పార్వతి దేవిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దారు. మండలంలోని టి.చదిపిరాళ్ల, గంగవరం, సంబటూరు, కుంట, కోగటం, మీరాపురం, రామాపురం, పెద్దచెప్పలి, దాదిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వెలసిన శివాలయాలు భక్తులతో కిట కిటలాడాయి. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పొలతలలో పోటెత్తిన భక్తజనం**

**పెండ్లిమర్రి :** జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో ఒకటైన పొలతల క్షేత్రానికి మూడవ కార్తీక సోమవారం భక్తులు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయ ఆవరణంలో కార్తీక దీపాలు వెలిగించి శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతీదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఈఓ క్రిష్ణానాయక్ చర్యలు చేపట్టారు. మల్లేశ్వరస్వామి, పార్వతీదేవి అమ్మవారి ఊరేగింపు అక్కదేవత గుడి వరకు వైభవంగా నిర్వహించారు. శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతీదేవి అమ్మవార్ల కల్యాణానికి ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి, చైతన్య దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకువచ్చారు.

**వీరపునాయునిపల్లెలో..**

**వీరపునాయునిపల్లె :** మండలంలోని సర్వరాయ సాగర్ వద్ద వెలసిన మునీశ్వర దేవస్థానం, అనిమెల సంగమేశ్వరాలయం భక్తులతో పోటెత్తాయి. గోధుమ పిండి, ఉసిరి కాయలతో ప్రమిదలను తయారు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. మునీశ్వర దేవస్థానం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోలాట కార్యక్రమంలో అనిమెల, గంగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన కోలాట బృందాలు పాల్గొన్నాయి.

మండలంలోని యు.రాజుపాలెంలోని రామలింగేశ్వర స్వామి, యన్.పాలగిరిలోని భీమేశ్వరాలయం, కీర్తిపల్లెలోని నల్లనమ్మ ఆలయం, ఉరుటూరులోని శివాలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి.

**చెన్నూరులో..**

**వల్లూరు (చెన్నూరు) :** మండలంలోని శివాల పల్లె వద్ద వెలసిన శ్రీ కాశీ విశ్వనాథ స్వామి, చెన్నూరులోని మల్లేశ్వర స్వామి , నాగ నాగేశ్వర స్వామి, రావణపల్లెలోని మల్లికార్జున స్వామి, కైలాసగిరిలోని సిద్ధి లింగేశ్వర స్వామి, ఉప్పరపల్లెలోని నాగ నాగేశ్వర స్వామి ఆలయాలో అభిషేకాలు, అర్చన ప్రత్యేక పూజలు చేశారు.

**పుష్పగిరిలో..**

**వల్లూరు :** పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. సంతాన మల్లేశ్వర స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు నదితో బాటు ఆలయ ధ్వజ స్తంభం వద్ద , ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు. పుష్పగిరి గ్రామంలోని వైద్యనాథ స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కామాక్షీ దేవి ఆలయంలో అమ్మవారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చనలు చేశారు. త్రికుటేశ్వర స్వామి, ఉమా మహేశ్వర స్వామి , భీమేశ్వర, భీమ లింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలను నిర్వహించారు.

**ఎట్టకేలకు ప్రమాద సూచికల ఏర్పాటు**

పుష్పగిరి వద్ద పెన్నా నదిలో భారీ ప్రవాహం కారణంగా ఏర్పడిన సుడి గుండాలు ప్రమాదకరంగా మారాయి. కార్తీక పౌర్ణమి రోజు కడపకు చెందిన గణేష్ అనే యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ సొంత నిధులతో నదిలో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని సూచిస్తూ రిబ్బన్‌లతో ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు.

**కొండాపురంలో..**

**కొండాపురం :** మండల పరిధిలోని బాలప్పకోన, నీల మల్లేశ్వర కోన, బెడుదూరు కోన గ్రామాల్లోని శివాలయాల్లో మూడవ సోమవారం మహిళలు ప్రత్యేక శ్రద్ధతో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**పండ్లతో అమ్మవారికి అలంకారం**

**వల్లూరు :** మండలంలోని పలు శివాలయాలలో శివ పార్వతులను, వినాయకుని , నంది వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వల్లూరులోని శ్రీ భవానీ శంకర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలను నిర్వహించారు. శ్రీ చక్ర సహిత భవానీ మాతకు వివిధ రకాల పండ్లతో చేసిన అలంకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్దపుత్త, పెద్ద లేబాక, అంబవరం, పైడికాలువ, తప్పెట్ల, గంగాయపల్లె తదితర గ్రామాలలోని శివాలయాలలో ఈశ్వరునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకాలను చేసి భక్తి శ్రద్ధలతో కొలిచారు.

**లింగాలలో..**

**లింగాల :** పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి ఆలయం, అంబకపల్లె, బోనాల, ఇప్పట్ల, మురారిచింతల, అక్కులగారిపల్లె, దొండ్లవాగు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ముక్కంటిని దర్శించుకున్నారు.

**భానుకోటలో కార్తీక పూజలు**

**సింహాద్రిపురం :** శ్రీభానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రం , గురిజాల గురకుంట్ల ఆలయాలలో కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకుని భక్తులు పరమేశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.


పులివెందుల : కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు


పులివెందుల : గ్రామోత్సవంలో కలశాలతో మహిళలు


పెండ్లిమర్రి:పొలతలలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


పుష్పగిరిలో స్థానికులు ఏర్పాటు చేసిన ప్రమాద సూచికలు

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

**జమ్మలమడుగు :** విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను పఠనం చేస్తే జ్ఞానం మరింత పెరుగుతుందని గ్రంథాలయాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్ కుమార్‌రెడ్డి, నరసింహులు, బీటీ నరసింహులు, ప్రమీల, సంజీవ రెడ్డి, ఇమాంహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్లలో చిత్రలేఖనం..**

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఉమాదేవి తెలిపారు. పట్టణంలో ఉన్న శ్రీ కృష్ణచైతన్య హైస్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారని తెలిపారు.


ఎర్రగుంట్ల:చిత్రలేఖనం పోటీలో విద్యార్థులు

**ఉపన్యాసం, పద్యపఠనం**

**సింహాద్రిపురం :** స్థానిక గ్రంథాలయంలో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివేకానంద, జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస, పద్యపఠన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆటల పోటీలు**

**లింగాల :** మండల కేంద్రమైన లింగాల శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ అధికారిణి జయమ్మ దిగువ లింగాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం వంటి పోటీలను జరిపారు.

**వ్యాసరచన, ఉపన్యాస పోటీలు**

**వేంపల్లె :** స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖాధిపతి పి.మాధవరావు మాట్లాడుతూ విజేతలకు ఈ నెల 20వ తేదీన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశాలలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలగొండ గంగాధర్, నాగలక్ష్మీదేవి, మల్లేశ్వరమ్మ, రేష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

**చిత్రలేఖన పోటీలు**

**పులివెందుల టౌన్ :** ఈనెల 24వ తేదీన చిత్రావతి చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నామని బాలోత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు గుర్రాల గోపాల్, కార్యదర్శి బి.లక్ష్మీరాజా తెలిపారు. సోమవారం స్థానిక గఫూర్ డ్రైవింగ్ స్కూలులో వారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలు అహోబిలాపురంలోని ప్రభుత్వ ఉన్నత (మెయిన్)పాఠశాలలో జరుగుతాయన్నారు. వివరాలకు 9573506118, 9491367752, 7675063933 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, సీఐటీయూ ఏరియా కార్యదర్శి గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

**గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు**

**కమలాపురం :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కమలాపురం శాఖా గ్రంథాలయాధికారిణి ఎస్. నాగాంజలి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం విద్యార్థులకు గ్రంథాలయాలు-వాటి ఆవశ్యకత, గ్రంథాలయాల వలన కలిగే ప్రయోజనాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తపోవనం ఆశ్రమంపై ఆంక్షలు తగవు

**వేంపల్లె :** పాపాఘ్ని నదీ తీరాన ఉన్న శ్రీప్రేమానంద తపోవనం ఆశ్రమంపై గండిక్షేత్రం అసిస్టెంట్ కమిషనర్ ఆంక్షలు విధించడం శోచనీయమని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కె.రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆశ్రమానికి వచ్చే భక్తులతో కలసి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి ఏసీ వెంకట సుబ్బయ్యకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ గత 29 ఏళ్ల నుంచి హిందూ ధర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి ఆశ్రమ సూచిక బోర్డును గండి దేవస్థానం అధికారులు తొలగించడం దారుణమన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మీరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు దొంతు సుమన్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు ఎస్.సునీల్ కుమార్, బీజేవైఎం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సోమా దశరథ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి 108 సిబ్బంది సమ్మె

**తొండూరు :** తమ సమస్యల పరిష్కారం కోసం 108 ఉద్యోగులు ఈనెల 25వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ఏపీ 108 సర్వీస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ సోమవారం స్థానిక తహసీల్దార్ బి.రామచంద్రుడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో 108 సిబ్బంది భూమిరెడ్డి గిరిధర్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, సలీమ్, సురేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

## మొబైల్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**వల్లూరు :** ఈ నెల 19 వ తేదీ నుంచి 29 వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఆధార్ సేవలను అందించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. 19న అంబవరం, 20న కొప్పోలు, 21న వల్లూరు, 22న దిగువపల్లె, 26న దుగ్గాయపల్లె, 27న తప్పెట్ల, 28న ఆదినిమ్మాయపల్లె, 29న పైడికాలువ గ్రామాల్లో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆహార సంరక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన అవసరం

**వేముల :** ఆహార సంరక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన, నైపుణ్యం కలిగి ఉండాలని ప్రిన్సిపల్ కె.శారదమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన వేముల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో విద్యార్థులకు టైం సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఉపాధ్యాయురాలు రామలక్ష్మి ఆహార సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేయించండి

**జమ్మలమడుగు :** పాత బస్టాండ్‌లోఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేయించాలని సీపీఎం నాయకుడు ఏసుదాసు కోరారు. సోమవారం ఆయన సీపీఎం నాయకులు, ఆటో యూనియన్ నాయకులతో కలిసి పాతబస్టాండ్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడిచే మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేయలేదన్నారు. అధికారులు స్పందించి ప్లాంట్‌ను శుభ్రం చేయడంతోపాటు నిర్వహణకు సిబ్బందిని నియమించాలన్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లి, దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

**వల్లూరు :** మండల పరిధిలోని దుగ్గాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ దత్తాత్రేయ స్వామి, గ్రామ దేవత గంగమ్మ తల్లి ఆలయాల్లో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఏపీఎస్ఆర్టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి, మాజీ జెడ్పీటీసీ, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతుల పర్యవేక్షణలో జరుగుతున్న ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా వేద పండితులు విజయ్ భట్టర్ ఆధ్వర్యంలో వేద పండిత బృందం తెల్లవారుజామున 3 గంటల నుంచి రెండు ఆలయాల్లో యంత్ర ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అనంతరం శ్రీ గంగమ్మ తల్లి, గణపతి, దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం రెండు ఆలయాల్లో శిఖర కలశ స్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని, దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం, రాత్రి దీపోత్సవాన్ని నిర్వహించారు.



దుగ్గాయపల్లెలో శ్రీ గంగమ్మ తల్లి, శ్రీ దత్తాత్రేయ స్వామి మూలమూర్తులు

**పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం, మేయర్**

విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్ బాషా, కడప నగర మేయర్ సురేష్ బాబు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ సలహాదారు, రాజోలు వీరారెడ్డి, మాజీ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డితో పాటు పలువురు నేతలు శ్రీ గంగమ్మ తల్లిని, దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.


కలశాలతో ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరులు

## డిసెంబర్ 15న సమగ్రత సభ

**పులివెందుల టౌన్ :** డిసెంబర్ 15వ తేదీన దేశ సమగ్రత, జాతీయ ఐక్యత కోసం కడపలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ధార్మిక సభ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముఫ్తీ మాసూం సాహెబ్, సంస్థ జిల్లా అధ్యక్షుడు హమీద్ హుస్సేన్, పులివెందుల సంస్థ అధ్యక్షుడు మౌలానా అబ్దుల్లా తెలిపారు. సోమవారం స్థానిక మర్కస్ మసీదులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మతాలకు, వర్గాలకు, పార్టీలకతీతంగా అందరూ ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు నూరుల్లాహ్, బాబా ఫకృద్దీన్, రఫీ, సర్వర్ వలి, గఫూర్, ముఫ్తీ కలిముల్లాహ్ మౌలానా అబ్దు రెహమాన్, మౌలానా అబ్దుల్ రహీమ్, హాఫీజ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.